క్లుప్తంగా

దుకాణాలకు నోటీసులు



ధన్వాడ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణ సముదాయాలకు గురువారం పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. అద్దె చెల్లించకుండా 3 నుంచి 4 నెలలు పెండింగ్‌లో ఉండటంతో నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

రెజ్లింగ్ కోర్టుకు రూ.11.50 లక్షలు



ధన్వాడ: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో రెజ్లింగ్ కోర్టు నిర్మాణం కోసం గురువారం భూమి చదును చేయగా.. పంచాయతీరాజ్ డీఈ యశ్వంత్, ఏఈ తరుణ్‌కుమార్ పనులు పరిశీలించారు. కోర్టు నిర్మాణం కోసం రూ.11.50 లక్షలు మంజూరయినట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్ తెలిపారు. త్వరలో ముగ్గు పోసి ఎమ్మెల్యే చేతుల మీదుగా పనులు ప్రారంభించి, పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

మద్దూరు డిగ్రీ కళాశాలకు ఫర్నీచర్ అందజేత



మద్దూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) అధికారి వెంకట్‌రెడ్డి రూ.రెండు లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను సమకూర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఈ. నారాయణగౌడ్ గురువారం తెలిపారు. ఇందులో కంప్యూటర్లు, ప్రింటర్, టేబుల్స్, కుర్చీలు, బీరువాలు, ఇతర ఫర్నీచర్ అందజేసినట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు గురువారం ఎంపీడీఓ సాయిలక్ష్మి కి ఫిర్యాదు చేశారు. రైతులకు, ఉపాధి కూలీలకు పనులు కల్పించని కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రైతులు ఉన్నారు.

న్యాయం కోసం హెచ్‌ఆర్‌సీకి..

కొత్తపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన బాధితుడు గత నెలలో జరిగిన ఘటనను నిరసిస్తూ హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమీషన్‌ను ఆశ్రయించాడు. తనపై జరిగిన దాడిలో భాగమైన వ్యక్తిపై, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మద్దూరు ఎస్ఐ, కోస్గి సీఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆశ్రయించినా న్యాయం జరగలేదని గురువారం పీఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు బీంషేన్, రాములు, సాయిలు, శివశంకర్ పాల్గొన్నారు.

జోరుగా అక్రమ వెంచర్లు

- పత్తా లేని పదిశాతం స్థలాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- వ్యవసాయ పొలాల్లోనే కమర్షియల్ నిర్మాణాలు



మండల కేంద్రంలో వెలసిన అక్రమ వెంచర్





వ్యవసాయ పొలాల్లో వెలసిన మినీ ఇండస్ట్రియల్ కంపెనీ, అనుమతులు లేని ఇటుక బట్టీలు

కృష్ణా: మండల కేంద్రంతో పాటు గుడెబల్లూర్, టైరోడ్, హిందూపూర్, కున్సీ గ్రామాల్లో వందల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు మండలంలో ఏ ఒక్క వెంచర్ కూడా లేకపోవడం విశేషం. అయినా మండల అధికారులు ఈ విషయంపై నిమ్మకునీరెత్తినట్లు ఉండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.లక్షలు పక్కదారి పడుతున్నాయని మండిపడుతున్నారు.

అనుమతులు లేకుండానే విక్రయాలు

ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్వాహకులు అక్రమ వెంచర్లు వేసి ప్లాట్ల విక్రయాలు కొనసాగిస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవటానికి, ఆ భూమి విలువలో 10 శాతం పన్ను చెల్లించి ఆర్‌డీఓ నుంచి, ఆ తరువాత వెంచర్ గ్రామ పంచాయతీ నుంచి లే అవుట్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా ఆ వెంచర్లలో 10 శాతం ప్లాట్లు భవిష్యత్ అవసరాల కోసం గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలి. ఒక వేళ ఈ విధంగా అనుమతులు లేకుండానే ప్లాట్లను కొనుగోలు చేస్తే, ఆ భారమంతా కొనుగోలుదార్లు వ్యక్తిగతంగా భరించాల్సి ఉంటుంది. కాబట్టి ప్లాట్లను కొనుగోలు చేసేవారు కచ్చితంగా ఆ వెంచర్లకు అనుమతులు ఉన్నాయా, లేదా అని నిర్ధారించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. కానీ దళారుల మాటలు నమ్మి ఇతర ప్రాంతాల వారు అనుమతులు లేని ప్లాట్లు కొని తర్వాత ఇబ్బందులు పడుతున్నారు. అనుమతులతో వెంచర్లు ఏర్పాటు చేసిన వారు సైతం కమ్యూనిటీ అవసరాలకు కేటాయించిన పది శాతం స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఎక్కడెక్కడ ఎంతెంత స్థలం ఉందో ఆయా గ్రామ పంచాయతీ అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది.

వ్యవసాయ భూములకు..

మండలంలో చాలా వరకు వ్యవసాయ భూములనే వెంచర్లుగా మారుస్తున్నారు. అధికారులు కూడా మామూళ్ల మత్తులో మండలంలో ఇష్టానుసారంగా నాలా కు అనుమతులు ఇస్తున్నారు. చట్టప్రకారం వ్యవసాయానికి పనికిరాని భూములకు మాత్రమే వెంచర్లుగా మార్చేందుకు అనుమతులు ఇవ్వాలి. కానీ మండలంలో ఎత్తిపోతల పథకాల కింద సాగు అవుతున్న భూములను కూడా వదలకుండగా ప్లాట్లుగా, వ్యాపార సముదాయాలుగా, మినీ ఇండస్ట్రీయల్స్, రైస్ మిల్లులు, కంపెనీలకు కేటాయిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములన్నీ..

మండల కేంద్రం నుంచి సరిహద్దులోని కర్ణాటక వరకు అంతరాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉన్న పొలాలన్నీ వెంచర్లుగా వెలుస్తున్నాయి. కానీ ఇందులో ఒకటి రెండు వెంచర్లకు మాత్రమే అనుతులున్నాయి. మిగితా వాటికి ఎలాంటి అనుమతులు లేకుండగానే దర్జాగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. వాటిపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం మూలంగానే కొనుగోలుదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

వేతనాల కోసం పంచాయతీ కార్మికుల భిక్షాటన



కోస్గిలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

కోస్గి రూరల్: నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికులు భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన చేపట్టారని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండుమాల్ రాములు అన్నారు. గురువారం పట్టణంలోని దుకాణ సముదాయాల వద్ద కార్మికులు భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.కోట్లు అభివృద్ధి పనులు, పెట్టుబడుల కోసం ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. కాయకష్టం చేసే కార్మికులపై కనికరం చూపకపోవడం సిగ్గుచేటని వాపోయారు. కార్మికులకు ఇచ్చే వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హన్మంతు, ఇక్బాల్, వెంకటయ్య, తిరుమలయ్య, వెంకటయ్య, రాములు, మొగులప్ప, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



ఎగడబండలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

మాగనూర్: మండలంలోని అడవిసత్యారం పంచాయతీ అమ్లేట్ గ్రామం పెగడబండలో గురువారం హౌసింగ్ డీఈ హరికృష్ణ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. తక్కువ సమయంలో రూ. 5 లక్షల వ్యయంతో పటిష్టంగా పేదలు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహ్మతుద్దీన్, పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు, కాంగ్రెస్ నాయకులు శివరాంరెడ్డి, మాజీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, లింగప్ప, రమేష్, కృష్ణ, రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

కాన్‌కుర్తిలో మెగా వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ సాయిరాం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యుల సమక్షంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు హరిచందన, ఐసీటీసీ కౌన్సిలర్ సుధాకర్‌బాబు, శివకుమార్, వెంకట్‌రెడ్డి, ఏఎన్ఎం శోభ, నర్మద, గోదావరి, భారతి, నర్సమ్మ, నారాయణమ్మ, విజయలక్ష్మి, కృష్ణ, చంద్రశేఖర్, నర్సింహ, అశోక్, బాలరాజు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ను సద్వినియోగం చేసుకోండి



ధన్వాడ: 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31లోపు పూర్తి ఫీజు చెల్లిస్తే 25శాతం తగ్గింపు ఉంటుందని ఎంపీడీఓ కొండన్న, ఎంపీఓ పావని, కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్లాట్లు ఉన్న వారు పూర్తి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తే ఈ అవకాశం వర్తిస్తుందన్నారు. లేదంటే 100శాతం జరిమానాతో చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

కోస్గి రూరల్: ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గానికి రూ.కోట్లు మంజూరయినా అభివృద్ధి పనులు చేపట్టకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ కోస్గి పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో వాపోయారు. అమృత్‌జల్ పథకం ప్రారంభించి మూడు నెలలు గడిచినా పట్టించుకునే వారు కరువయ్యారని, రామాలయం చౌరస్తా నుంచి సయ్యద్‌పహడ్ దర్గా వరకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించినా పనులు చేపట్టడం లేదని తెలిపారు.

వృథాగా తాగునీరు



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో కుళాయిలకు ఆన్ ఆఫ్‌లు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. ఎండకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైంది. కానీ కొన్ని గ్రామాల్లో మిషన్ భగిరథ, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథా అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టాలని కోరుతున్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

దామరగిద్ద: మండలంలోని మొగుల్‌మడ్క ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుకు గురువారం నారాయణపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ హరినారాయణ బట్టడ్, క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి బాలాజీ, జనార్దన్, రవికుమార్‌గౌడ్, ఆత్మారాం, జీహెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శశిధర్, నవ్యశ్రీ, భాగ్యమ్మ, బసదయ్య, అంజిలయ్య, అంజప్ప ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, డీఈఓ అబ్దుల్ ఘనీ

వనపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో భాష, గణిత విషయాల్లో వెనుకబడిన 3, 4, 5 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. వాటిపై పట్టు సాధించేలా ఏఐ టూల్స్ ద్వారా బోధన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని గురువారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా కలెక్టర్లతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో ఎంపిక చేసిన 11 పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత బోధన ప్రారంభించేందుకు ఎంఈఓలు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెరిగి భాష, గణిత శాస్త్రంపై కొంతమేర పట్టు సాధించే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ, మహానంది తదితరులు పాల్గొన్నారు.

ఫారం 6, 7, 8 పూర్తి చేయాలి

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. గురువారం తెలంగాణ ఎన్నికల సీఈఓ సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. సీఈఓ మాట్లాడుతూ మార్చి 19 లోపు ఈఆర్వో స్థాయిలో, మార్చి 22 లోపు జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 అప్లికేషన్లను మార్చి 21లోపు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో వారి నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కిషన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మద్దూరులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ మహేష్‌గౌడ్



కొత్తపల్లి పాఠశాలలో ప్రత్యేకాధికారి ఈశ్వర్‌రెడ్డి

మద్దూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మహేష్‌గౌడ్ వంట ఏజెన్సీ వారికి సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనంతో పాటు.. పాఠశాలకు సరఫరా అయ్యే బియ్యం, ఇతర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈయన వెంట ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా శివరాజు



శివరాజును సన్మానిస్తున్న వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం సభ్యులు

నారాయణపేట: స్థానిక మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది శివరాజును నియమించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సూచనలతో బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం శివలింగేశ్వరస్వామి ఆలయంలో ఆయనకు వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించి, అర్చకులు ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గందె చంద్రకాంత్, అవుటి రవికుమార్, గందె రవికాంత్, కన్న జగదీష్, లిఖి రఘుబాబు, కంసన్‌పల్లి మల్లికార్జున్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని సీపీఐఎం ఎల్ మాస్‌లైన్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు కనకరాయుడు మాట్లాడుతూ కొన్ని నెలలుగా గ్రామానికి ఇన్‌చార్జ్ కార్యదర్శి ఉండడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వేసవి ఎండలు తీవ్రం కావడంతో గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని, వీధి లైట్లు కాలిపోతున్నా పట్టించుకునే వారు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు అంజప్ప, గురుమూర్తి, శివ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మక్తల్: పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాలలో జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దీప ఆధ్వర్యంలో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా షూటింగ్ బాల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి గోపాలం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రాంబించారు. పోటీలకు 100 మంది క్రీడాకారులు హాజరుకాగా.. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అఖిల, గాయత్రి, స్వప్న, శ్రీలత, పల్లవి, స్వప్న, ఆకాష్, అరవింద్, అశోక్, అఖిల్ ఈ నెల 15వ తేదీ నుంచి 16 వరకు వరంగల్‌లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అధ్యక్షుడు సత్యఅంజనేయులు, అంజయ్యచారి, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



షేర్నపల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



బుడ్డగానితండాలో..



ఉడ్మల్‌గిద్ద యూపీఎస్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ బోధన చేసిన చిన్నారులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. కొత్తపల్లి మండలంలోని ఎక్కామేడ్, మన్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో, మక్తల్ మండలంలోని ఉప్పర్‌పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో, మరికల్ మండలంలోని బుడ్డగానితండా ప్రాథమిక పాఠశాలలో, దామరగిద్ద మండలంలోని కాన్‌కుర్తి, ఉడ్మల్‌గిద్ద, మద్దెల్‌బీడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో, నారాయణపేట మండలంలోని షేర్నపల్లి యూపీఎస్ పాఠశాలలలో, కృష్ణా మండలంలోని మురహర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృష్ణారెడ్డి, సంజీవ్, శంకర్, నాగలక్ష్మి ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, మాధవిలత, మాణికిబాయి, ప్రశాంతి, భాగ్యలక్ష్మి, మల్లేశ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదుగ పూలతో హోలీ



హోలీ ఆడేందుకు సిద్ధం చేసుకున్న రంగు సీసాలతో విద్యార్థులు



ధన్వాడలో హోలీ ఆడుతున్న ప్రజలు

దామరగిద్ద: హోలీ అంటేనే గుర్తుకు వచ్చేది రంగులు. కాన్‌కుర్తి జీపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి సమక్షంలో విద్యార్థులు తోటి విద్యార్థులకు పర్యావరణ హితమైన రంగులతో హోలీ జరుపుకోవాలన్న సందేశాన్ని అందించేలా శుక్రవారం హోలీకి ముందురోజు సహజంగా దొరికే పూలతో రంగును సిద్ధం చేసుకొని హోలీ సంబరాలు నిర్వహించారు. ఉదయం పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి గ్రామ సమీపంలో మోదుగ చెట్లకు పూసిన పూలను తీసుకొచ్చి, వంట మనిషి సాయంతో విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఉడికించి వడపోసి అరుణ వర్ణం రంగును సిద్ధం చేసుకున్నారు. ఆ రంగులనే విద్యార్థులకు అందించడంతో ఒకరిపై ఒకరు చల్లుకొని ఆనందించారు.

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి పాఠశాలలో విద్యార్థులు రంగులను ఒకరిపై ఒకరు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. ధన్వాడ మండల కేంద్రంలో గ్రామస్తులు హోలి వేడుకలు నిర్వహించారు.